# భూదేవి తోడు...!

— వరీనియా

**గులాబీరంగు కవరు టేబిల్ మీద వుంది. ఆఫీసు నుండి అలసిపోయి-యింటికి చేరిన శృతి-ఆ కవర్ని రెప్పపాటు కాలం చూసి-**

**చేతిలోని పుస్తకాలూ, హేండ్ బేగూ టేబిల్ మీద పడేసి, వంట గదిలోకి నడిచింది. వంట గదిలో-నరస వంటకు సామాగ్రి సిద్ధం చేస్తోంది. శ్రుతిని చూసి-**

"అమ్మగారూ-వొచ్చేసారా! కాఫీ కలపమంటారా? ఆ...మీకొచ్చిన ఉత్తరం టేబిల్ మీద పెట్టాను. చదువుతుండండి, కాఫీ చేసి తెస్తాను" అంది.

పది గంటల నుండి ఆఫీసు పనితోనూ, సిటీ బస్సు ప్రయాణంతోనూ-బడలిక చెందిన శ్రుతి-

"ముందు వేడినీళ్ళు పెట్టు స్నానానికి, చిరాగ్గా వుంది" అంది.

"కాచాను. ఉడుకు నీళ్ళ స్నానం చేసి, కాఫీ తాగితే-చిరాకు చింతచెట్టెక్కి పోద్ది. పెలాకు చేమంతి పువ్వులాగ పూస్తాది."

"యెక్కడ నేర్చుకున్నావోగాని-అన్నీ జంటపదాలే! భలేగా మాట్లాడతావు" అంటూ నవ్వుతూ, నరస కెదురుగా స్టూలు మీద కూర్చుంది శ్రుతి, నరస మాటల్ని విని ఆనందించాలని!

"మాటలకేటమ్మా- మనసు కిష్టమవ్వాలిగాని లోపలి యేటనుకుంటామో-అవన్నీ ఊటలాగ ఊరిపోయి వొస్తాయి. నోటెల్లి గల, గలా పలికెత్తాయి. యిష్టంలేపోతే-ఊటాలేదు, మాటా రాదు" అంది నరస.

"అయితే యిష్టమైనవారి యెదుటే మాటలొస్తాయంటావ్?"

"అంతేగదమ్మా! యిష్టంనేపోతేటి మాటాడతాము? ఇష్టమొచ్చినట్టుగే...ఊ, ఆ...అని మూలగటం తప్ప! ఇష్టమొచ్చి నోట మాటాడగ్గలేటి? రెండు రోజు కాంచి-మా బావతోటి మాట్లాడతన్నా నేటి?" అని అడిగింది నరస. యే భావమూ లేకుండా- మామూలుగా ఓ వాస్తవ విషయం చెప్తున్న రీతిలో!

నరస బావ పేరు సింహాచలం! నరస మేనత్త కొడుకే సింహాచలం. కన్నవారికీ మేనత్తకూ యిష్టం లేకపోయినా-పట్టుబట్టి, అందర్నీ నొప్పించి-సింహాచలాన్ని పెళ్ళి చేసుకుంది. ఆ పెళ్ళి సింహాద్రప్పన్న కొండ మీద జరగాలని పట్టుబట్టింది. అలాగే జరిపించుకుంది.

పసుపుతాడు మెడలో పడ్డాక పసుపంచు కోకతో పెళ్ళికూతురు ముస్తాబులో నరస-సింహాచలాన్ని గట్టిగా కౌగలించుకుంది. పూజారీ, పెళ్ళికి వచ్చిన బంధువులూ విస్తుపోయారు. నరస యిదేమీ పట్టించుకోకుండా సింహాచలం చేతిని పట్టుకుని దాదాపుగా పెద్దవాళ్ళు చిన్న పిల్లల్ని నడిపించుకు వెళ్ళే విధంగా సింహాద్రప్పన్న కడకు తీసుకు వెళ్ళింది. పెద్దలు-పిల్లల అరచేతుల్ని కలిపి, ఎత్తి 'జేజి-జేజి' అని మొక్కించే విధంగా; సింహాచలం అరచేతుల్ని తన అరచేతుల్తో జోడించి-దేవుడికి మొక్కింది.

> **వ్యక్తిత్వానికీ వ్యక్తిగత అహంకారానికీ తేడా తెలుసుకోకపోతే, అనవసర అపరిష్కృత సమస్యలెన్నో పుట్టుకొడతాయి. సహజీవనానికి పరస్పర సహకారం తప్పని సరి. చదువుకున్న వాళ్ళకన్నా, చదువురాని అమాయకుల్లోనే యీ సహకారం ఎక్కువగా వుండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. శ్రమ జీవనంలో సహజంగానే సహజీవనం వుంటుందేమో!**

అలా, ఆ విధంగా, ఆ క్షణం నుండి-నరస తన సర్వస్వమూ సింహాచలంగా భావించింది. తమ తమ శరీరాలు వేరుతప్ప; వాటి అనుభవాలూ, అనుభూతులూ యిద్దరి స్వంతమూ అనుకుంది.

అత్తా, మామలకూ, బంధువులకూ యిది విపరీతంగా తోచింది. సందు దొరికినపుడల్లా "మొగుడ్ని కొంగున కట్టుకుంది" అని అత్తా, ఆడపడుచులూ; "కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్టుగా-మరెవులి మెరగమా సంసారాలు? సాల్లెమ్మా, సాల్లు! సరసమెక్కువయితే-సంసారికి పనికిరాదు" అని బంధువులూ అనుకునేవారు.

నరస వీట్నీ అంతగా పట్టించుకునేదికాదు. పిల్ల గట్లమీదనుంచి పొంగిపొర్లే కాలువలా-సింహాచలాన్ని చేరేది. సింహాచలం ఏరుబూని దుక్కిదున్నితే నరస సద్దన్నం తెచ్చి, గట్టున దించి, యేరు సాలు ఎనకే నడుస్తూ కడతేరని కబుర్లు చెప్పేది. సింహాచలం విత్తనాలు జల్లితే, గంపతో నిల్చొని విత్తనాలు చేతుకు అందించేది. పారనికి వొంగొని సింహాచలం గట్లు చెక్కితే గరిక దుబ్బుల్ని యేరిపారేసేది. ఆకు తీసి కట్టలు కడితే-ఆకు కట్టలందుకుని- మొనగట్టే ఊడుపు ఊడిసేది.

తొలకరి వానలో తడిసిన యిద్దరూ...అర్ధాకుల గొడుగు కింద హత్తుకుని నిల్చొనేవారు. ఓ వాన చినుకు-వారిద్దరి మధ్యా చోటమ్మని-గొడుగు మీదపడి గింజాకునేది. ఓ చల్లని చిరుగాలి-వార్ని విడదీయాలని- తడిసిన వారి బట్టల్ని స్పృశిస్తూ, బతిమాలేది. పొద్దుగుంకిన వేళ, గొడుగుకింద యిద్దరూ-యింటివైపు అడుగులేస్తుంటే ఆ జంటను చూడాలని-ఓ మెరుపు తీగ తెగ ఆశపడి-మెరిసిపడేది!

ఋతువుల్తో పరుగెత్తుతూ, పంట కొచ్చిన చేనులా నరస గర్భవతి అయ్యింది. పంట చేల గాలుల మధ్య-తన బావకు తను కలలపంటను అందివ్వాలను కుంది నరస! ఆ కోర్కె తీరలేదు. ఆసుపత్రిలో నరసను చేర్చారు. అతి ప్రయాసతో డాక్టర్లు-నరసను బతికించారు. తనలోని అణువణువూ విడదీసి, పసికందును పెంచితే-ప్రసవం అయిన కొద్ది క్షణాలకే ప్రాణమొదిలింది పసికందు. నరస నిలువునా కృంగి పోయింది.

ఆ తర్వాత నరస ఆర్థిక పరిస్థితి మారిపోయింది. ఆసుపత్రి ఖర్చుల అప్పు-అరెకరా మడిచెక్కని నొక్కేసింది. తిండి గింజల యిబ్బంది-యింట్లోని యిత్తడీ కంచూ సామానును అమ్మించింది. కరువు, మీద కరువు...పొలంలోని ఎడ్లని సంతకి తోలించింది. ఆకలీ, వార్ధక్యమూ-నరస అత్తను కాష్టానికి పంపించింది. రెక్కలాస్తితో నరసా, సింహాచలాలు



మిగిలారు పెళ్ళి యిన అయిదేళ్ళకి! రెక్కలే మిగిల్నోలికి ఎక్కడైతేనేటి?- అని యింటిని, కొత్తగా కన్సాలిడేట్ కాలనీపై జాయి నయిన టీచర్‌కి అద్దెకిచ్చి, ఆలూమగలూ పట్నం వచ్చేసారు.

పట్నంలో సింహాచలం-శ్రరం కూలీలో కలాసీగా చేరితే, నరస పనిమనిషిగా నాలుగిళ్లు వెదుక్కుంది. అలా శ్రుతి యింటిలో పనిమనిషిగా చేరింది నరస!

ఈ విషయాలేవీ తెలీవు శ్రుతికి. వరదాగా, వలాకీగా నోరువిప్పితే-గంగలా గోదావరిలా ప్రవహించే- నరస మాటలంటే శ్రుతికి యిష్టం! స్టూలు మీద కూర్చుని శ్రుతి-

"అయితే ఎందుకో మీ బావతో తగువు?" అడిగింది.

"మా బావకిక్కడుండడం యిష్టం లేదట. ఊరెళిపోదాం అని గుణుస్తాడు. ఊరాట ఊరు... ఊరింకేటి మిగిలింది? మాన్నేలున్నాయా-యేలటానికి? నేను రానన్నాను. అలిగినాడు" అంది నరస.

"పోని-యిక్కడ చేసేపనేదో-అక్కడే చేసుకో వచ్చుగదే? యీ పరాయి పట్నం కంటే-స్వంత ఊరులో బాగుంటుంది కదే?" అని ప్రశ్నించింది శ్రుతి!

"అవంక్కడ కూలే పుట్టదమ్మా! అల్లా ఉభాలు నాల్రోజులూ, కోత, మోతల్నాడు...కూలి దొరుకుతాది.

ఆ తరువాత పనీ, పాటుండవు. కూలి దొరకదు. కొండలంటా, మెరకలంటా తిరిగి - కర్రా, కంప సరికి మోపులు గట్టి తెచ్చి; కాపీ ఒటేలోలికి... టేసింకి అమ్ముకొని - ఆ టేసిలు తాగి బతకాలి!" అని జవాబు పలికింది నరస.

"మరెందుకలాంటి ఊరెళిపోదామంటాడు?" శ్రుతి ప్రశ్నించింది.

"అదేటో... పట్నం మీదల యిసిగి పోనాడు గావాల! ఎప్పుడూ - యిరుకిల్లల్ల యిరకటం, ముక్కు ముక్కు నీటితోటి ఒళ్ళుకి పట్టిన సెమటన ఒదల్ని స్నానం. నేనే అంటాడు! కడుపుకి తక్కువేటైనా ఊరిలో పల్లెగాలి, రచ్చ బండా, నాగావళి నదీ, మామిడి తోటలూ... హాయిగా పుండొచ్చక్కడం టాడు. 'నాగావళి నీలు తాగేసి, తోటలంట ఆకులములు తినేసి రచ్చ బండకాడ పల్లెగాలికి తొంగోడంకి కెంతువుని మేటేమునిమూ' అన్నాను! అంతే కోన ముచ్చి తిట్లెత్తుకున్నాడు. నేనూ తిట్నాను. ఎదురు తిడతానే - అని కొట్నాడు. కొడతావా నన్ను? యింది కేనా నీ సెయ్యి పట్టుకొని, పట్నమొచ్చినాను? యిందికా నిన్ను కట్టుకున్నాను? అని యేడిస్తి; యికప్పుడే కొంచి మరి మాట్లాడ్డం మానీసినాను. అదమ్మా సంగతి! కామగానీ, మాటల్లపడి పోయి - నీలు మరిగి పోనాయేటో మాడ్నేదు! రండమ్మ గోరూ... తానం సేయండి" అని పిల్చింది.

శ్రుతి స్నానం చేసి ఫ్రెష్ అయి - కుర్చీలో చేరబడగా; నరస టీ చేసి తెచ్చియిచ్చి -

"ఉత్తరం చింపేనా చింపలేదేటమ్మా?" అనడిగింది.

"అది చింపి, చదవక్కరలేదే?"

"అదేటమ్మా? అయ్యగోరి కాడ్నుంచి గాదా?"

"అందుకనే - చూడక్కరలేదు. యేముంటుందందులో? మామూలే. ఉద్యోగం మానెయ్యి. నాకిక్కడ కష్టంగా వుంది. ఇంట్లో కాలక్షేపం వుండదు. హోటల్ భోజనం పడదు. వచ్చే పోయే బంధువులూ, ఇల్లాలు లేకుంటే ఎలా? మనకేం కొదువ? నువ్వే సంపాదించాలా? నా సంపాదనా, తరగని నా ఆస్తీ యేం చేసుకుంటాం? ఇంటిని దిద్దుకొని, మా యింటి పేరు నిలుపు! ఇవే, యివే వాక్యాలుంటాయి! ఒకోసారి అభిమానంగా అర్థిస్తాయి, ఒకోసారి ఆగ్రహంగా గద్దిస్తాయి. అందుకనే చింపలేదు" అంది శ్రుతి!

"అదేటమ్మా? చిత్రంగా మాటాడుతారు. ముబ్బరంగ ఉజ్జోగం మానేసి, యింటి పట్టునుండ మంతం్రదు తప్పా?"

"ఉద్యోగం మానేసి, ఆయన యింట్లో, ఆ యింటి పని చేసుకుని, ఆయన పెట్టే తిండి తిని బతుకు వెళ్ళదీయడంలో యేం అర్థముందే నరసా? స్వేచ్ఛగా, నా కష్టఫలంతో నేను బతకాలిగాని...!"

"ఎవురి డబ్బు - ఎవురు తింటున్నారు? ఎవురి సేన ఎవురు సేత్తను - అని పెనిమిటీ, మొగుడూ లెక్క లేసుకుంటే అది సంసారం సేసినట్టుగ కాదు - యాపారం సేసుకున్నట్టగే!

పొద్దారిన కాంచి, మల్లీ పొద్దు దాకా - ఒకరి కొకలు తోడుగా, కడదాకా జతగా వుండానికి అదా, మొగా పెల్లి సేసుకోవాలంగాని; ఎవురి గీత అలు దాటకుండా వుండడానికి పెళ్ళేంటమ్మా? రొండు రోజాల కాంచి - నాకు కాలూ సెయ్యి ఆడ్డం లేదు, మా మావతోటి మాటల్లేనందుకు"

"నీ కంతే తెల్సులే! ఒ పేన్, అయితే చూడే..." అని శ్రుతి గభాల్న ఉత్తరం తీసి, చదివింది. చదివి -

"చూడే ఈ ఉత్తరం! యింట్లో వంట కిబ్బందటా! వంట మనిషిని మానుకోమనే! ఇల్లు చూసే దిక్కు లేదటా - సెక్యూరిటీ గార్డుని పెట్టుకోమనే! కాలక్షేపం లేదటా - టీ.వీ. రేడియో పెట్టుకోమనే! ఇందుకేనాపెళ్ళాం? ఇందుకేనా?" అని ఆవేశంగా అడిగింది.

"మీలాంటి సదుంకున్నాలే - కాయితాల మీద పెళ్ళాం మొగుల్లెందుకో, ఎంగుండాలో, రాసుకుంటారు. అట్నే తప్పు బడతారు. మా కివన్నీ కాయితాల మీద కనబడవమ్మా! అడుగుతీసి అడుగేస్తే, పెదివి యిప్పి పలికితే, సేయి కదిపితే, అన్నీట్లా, అన్నిటకాడా - ఆలూ మొగులు ముద్ర కనబడతాదమ్మా మాకు! నీను పాచి పనికి మీ యిళ్ళ కొత్తే - నా మొగుడు నా యింటిల నీళ్ళు తోడి వుంచుతాడు. అడు పనిలోకెల్తే, నేను కేరేజి వండి, పొట్టుకెల్తాను. సాయింత్రం - మల్లా మీ యిల్లూ, మీ యిల్లూ పనైని నీను తిరిగెల్లి నరికి - కూరలు తరిగుంచుతాడు. పొయ్యి రాజేత్తాడు. ఇందల - ఎవురిని ఎవురికి ఎట్టే సేత్తన్నాం? ఎవురి సొమ్ము ఎవురిని తింటన్నాం - తేల్చి సెప్పండమ్మా?" అనడిగింది నరస!

"ఏదయినా - మీ తీరు వేరు, మా తీరు వేరే! నా జీవితాన్ని... అతడి ముంజేతి మీద ఆడించాలి. అదిగో అదే నాకిష్టం లేదు. నా స్వేచ్ఛను నేను అనుభవిస్తూ అతడితో జీవితాన్ని పంచుకోవాలి గాని - నా స్వేచ్ఛని బలిచ్చి కాదు!" అంది స్థిరంగా శ్రుతి!

"ఏటో... మీ యిద్దరిల యెవుర్ది తప్పో నాకు తోదనన్నేదు! రాత్రయి పోనాది, నానెల్తా నమ్మగోరూ!" అని నరస బయల్దేరి వెళ్ళి పోయింది!

శ్రుతి నరస ప్రశ్నల్ని ఆలోచిస్తూ ... అలసిన మనసుతో నిద్రపోయింది!

** ** **

తెల్లవారింది. లేయెండ హాయిగా వుంది. శ్రుతి డాబా మీద నిల్చొని వీథిలోకి చూస్తోంది! వీథి చివర నున్న నరస యింటి పెరడు కన్పిస్తోంది.

సింహాచలం స్నానం చేస్తోంటే - నరస వీపు తోముతోంది. ఆ దృశ్యం చూసి శ్రుతి విస్తుపోయింది. 'నిన్న రాత్రి తన మీద చేయి చేసుకున్న బావకు, ఈ రోజు వీపు తోముతోంది. ఎంతలో అవమానాన్ని మర్చిపోయింది! యిదే స్త్రీ బలహీనత! ఛి, ఛీ!' అనుకొని, డాబా దిగి యింట్లోకి వచ్చేసి, ఈజీ చెయిర్‌లో కూర్చుని పేపర్ అందుకొంది! వరకట్న హత్యలూ రేపులూ, వేశ్యా వాటిక అమ్మకాలూ - వార్తల్లో... పేపరు శ్రుతిని మరింత మండించింది. విసుగ్గా పేపర్ పడేసి, వంటింట్లోకి, అట్నుంచి మళ్ళీ వసారాలోకి అటూ, యిటూ పచార్లు చేయసాగింది.

ఇంతలో నరస - యిస్త్రీ చేసిన పచ్చంచు వాయిలు చీర కట్టుకుని, తలనిండా పూలతో, బొట్టూ, కాటుకతో ముస్తాబయి వచ్చి -

"అమ్మగోరో, మరేటనుకోకండి. మాం మా ఊరెల్లి పోతన్నాం. పని మనిషిని మీకు ఎతికి తెచ్చేన్నండి. ఇదిగో యీగుంటే - మా యన్న కూతురు. గురివి దీని పేరు. యీ యిదే. . .

మా ఊరిల పేదలంతా కలిసి సంగం కట్నారట. బంజరి భూములూ, సీలింగు భూములూ ఆక్రమించి, పంచుకొని దున్నుకుంటన్నరట! మమ్మల్ని రాన్పి మన్నారు మా ఊరోలు, అలతోటి కలిసి - ఆ భూములు దున్నుకుంటాం! ఇక్కడి కూల్నాలి యేల ఊరు గాని ఊరిల? రైతోలిని - మాకు భూదేవికి మించిన తోడు నేదు. భూదేవి తోడుకి - మాం ఎలిపోతన్నాం! ఒత్తామమ్మా! ఉత్తరాలు రాత్తుండండి. అన్నట్టేగా - అయ్యగారి ఉత్తరంకి జవాబు రాయండమ్మా! ఆలోసించండి... పొత్తానండమ్మగోరో, బస్సు కెలయి పోనాది, పొత్తాను మరి" అని గాభరా, గాభరాగా గబ, గబా విషయాలన్నీ చెప్పి-వెలిపోయింది నరస!

శ్రుతి ప్రశ్నలు శ్రుతిలోనే సమాధానాలకై సుడి తిరగగా జీవితానుభవం నరసా, సింహాచలాన్ని... కలిపింది. పల్లెకు పంపింది!

యే సమస్యకైనా, యెవరికైనా - జీవితానుభవమే పరిష్కారాన్ని అందిస్తుంది.

## సంతోషం!
## ప్రతిభావంతులారా!!

ప్రతిభావంతులు మా తాతగారు!
గొప్ప వ్యాపారులు ఆయన
రెండు చేతులా సంపాదించారు
(జనాలు బికారులుగానే మిగిలారు!)
మా నాన్నగారూ ప్రతిభావంతులే!
అర్థిక శాస్త్రాచార్యులు ఆయన
వ్యాసాలు పరంపరగా రాశారు
(జనాలు నిరక్షర కుక్షులే మరి!)

మా చిన్నాన్నగారు ప్రతిభావంతులే
గొప్ప భవన నిర్మాణ శిల్పి ఆయన
భవంతులూ, ఈత కొలనులూ నిర్మించారు
(జనాలకి కొంపాగోడూ లేక పోతేనేం?)
మా అన్న కూడా ప్రతిభావంతుడే
'గోల్డ్ మెడల్' విజేతా వైద్యంలో స్పెషలిస్టు
అమెరికాలో 'గ్రీన్ కార్డు' కూడా సాధించాడు.
(జనాలకి మాత్రం రోగాలే తెగుళ్ళే అనుకోండి)

నేను మాత్రం? నేనూ ప్రతిభావంతుణ్ణే!
ఎందరు సంపాదించగలరు 'ఫెలోషిప్' నాలా?
రోజంతా కష్టిస్తాను, నా 'స్టేటస్'తో
ఐ.ఎ.ఎస్సా, ఇన్‌కంటాక్సా?
రేపు నా కొడుకు మాత్రం?
తప్పకుండా ప్రతిభావంతుడే!
అతని కొడుకూ...
అతడి కొడుకూ కూడా...
మీరే చూడండి! ఎన్ని తరాల ప్రతిభో!
మా 'రక్తం' లోనే వుంది - ప్రతిభ! మెరిట్!

(సంతోషం ! ప్రతిభావంతులారా !
మేమెన్నడూ ఎరగం, ఆశ్చర్యం!
'రక్తం'లో ఎర్ర, తెల్ల కణాలేగాక
'ప్రతిభ' కణాలు కూడా వుంటాయని!
ఎన్నడూ ఎరగం, ఆశ్చర్యం!
రక్తానికి మారు పేర్లు! మరో పేరు
ఇంకో పేరు — 'మెరిట్' అని!)

-ఉదయ కుమార్